దాచుకోవడం, దోచుకోవడమే టీడీపీకి తెలుసు

– ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా

కడప కార్పొరేషన్: దాచుకోవడం...దోచుకోవడమే తెలుగుదేశం పార్టీ నాయకులకు తెలుసని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక 48 వ డివిజన్‌లోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం సమీపంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, వారు పొందిన లబ్ధి సమాచారంతో కూడిన బుక్ లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పి. షహనాజ్ అనే మహిళ మాట్లాడుతూ జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్ఆర్ పింఛన్ కానుక, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా తమ కుటుంబానికి రూ.11 లక్షల 83 వేలు లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసింది. బి. రాములమ్మ అనే మహిళ తనకు వైఎస్సార్ పింఛన్ కానుక, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ. 9, 84,736 లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసింది. పేదలకు సాయం చేస్తున్న ఇలాంటి ముఖ్యమంత్రి కలకాలం ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, కార్పొరేటర్లు పాకా సురేష్, షఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య, జయచంద్రారెడ్డి, తోటక్రిష్ణ, సుభాన్‌బాషా, రామ్మోహన్‌రెడ్డి, నాగమల్లారెడ్డి, టీపీ వెంకట సుబ్బమ్మ , మరియలు, సుశీలమ్మ, నారాయణమ్మ చైతల్య పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

లోకానికి ఆదర్శమూర్తి ఆరోగ్యమాత

కడప కల్చరల్ : కష్టాలు, సమస్యలు వచ్చినపుడు మరియమాతను ప్రార్థించాలని, ఆ తల్లి తప్పక పరిష్కారం చూపగలదని డాన్ బోస్కో గురువులు రెవ ఫాదర్ కాసు లూర్దు అన్నారు. కడప నగరం రైల్వే స్టేషన్ వద్దగల ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో జరుగుతున్న నవదిన ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు కడప డాన్ బోస్కో ఐటిఐ గురువులు రెవరెండ్ ఫాదర్ విద్యాసాగర్ దివ్యబలి పూజను సమర్పించగా, కాసు లూర్దు మరియతల్లి సందేశాన్ని వినిపించారు. దివ్యబలి పూజకు ముందు ప్రత్యేకంగా అలంకరించబడిన మరియ తల్లి స్వరూపాన్ని పల్లకీలో ఉంచి చర్చి ఆవరణలో ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాలలో పాటలు, తేరు, దివ్య దివ్యబలి పీఠం అలంకరణ డాన్ బోస్కో ఐటిఐ కడప విద్యార్థులు నిర్వహించారు. దివ్యపూజ బలి అనంతరం, పూజను, సందేశాన్ని అందించిన గురువులకు శాలువా, పూలమాల, పుష్పగుచ్ఛం, శాంతి సేవా సొసైటీ వారి మెమెంటో, అరులయ్య కరుణయ్య పుస్తకంతో వారిని కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ ఎండి ప్రసాదరావు, సహాయ డైరెక్టర్ ఫాదర్ విల్సన్ ఆరోగ్యమాత అమ్మగార్లు, ఆరోగ్యమాత యువత విభాగం, అధ్యక్ష, కార్యదర్శులు వినీత్, రాకేష్, కోశాధికారి, సన్నీ, సభ్యులు పాల్గొన్నారు.



దైవ సందేశం అందజేస్తున్న క్రైస్తవ గురువు

ప్రజా శ్రేయస్సే సీఎం జగన్ లక్ష్యం

– ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా పాలన సాగిస్తున్నాడని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నందిమండలం–1 గ్రామ సచివాలయం పరిధిలోని తిప్పరాజుపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సీకేదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డితో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి నాలుగున్నరేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కొందరు పక్కా గృహాలు, పింఛన్, రేషన్‌కార్డులు రాలేదని అడిగారు. వారికి సంక్షేమ పథకాలు ఎందుకు రాలేదో చూడాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం ఆయన నందిమండలం–1 గ్రామ సచివాలయంలో నూతనంగా మంజూరైన 168 పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. పింఛన్ల కొసం లబ్ధిదారులు ఎవరి వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. అర్హత ఉంటే వలంటీర్‌కు సంబంధిత ప్రతాలు అందిస్తే పింఛన్ వస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, సర్పంచ్ రామమోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు లలిత, సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు రవి, ఎరికల్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, గంగిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

ఆలయాలలో విశేష పూజలు



గంగమ్మ పూజలో భక్తులు



వాయనాలు స్వీకరిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరంలో కొలువై ఉన్న శ్రీ వాసవీ కన్యాకా పరమేశ్వరీదేవికి ఆ సమీపంలోని నడివీధి గంగమ్మ శ్రావణమాసం మూడవ శుక్రవారం సంప్రదాయబద్ధంగా వాయనం సమర్పించారు. నడివీధి గంగమ్మ క్షేత్ర నిర్వాహకులు గోపాల్‌సింగ్ దంపతులు ఈ సందర్భంగా 108 మంది దంపతులకు వడిబియ్యం సమర్పించి మంగళ వాయిద్యాలతో గంగమ్మను ఊరేగింపుగా సమీపంలోని అమ్మవారిశాలకు తీసుకొచ్చారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో వడిబియ్యం స్వీకరించిన మహిళా భక్తులంతా సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. పూజలనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా తాము తెచ్చిన 108 రకాల పండ్లు, స్వీట్లను శ్రీ కన్యకాంబకు సమర్పించారు. పూజ అనంతరం తిరిగి ఊరేగింపుగా గంగమ్మ తల్లి క్షేత్రానికి చేరుకున్నారు.

భక్తులకు వాయనాలు

కడప గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో శ్రావణమాసం మూడవ శుక్రవారాన్ని పురస్కరించుకుని రాత్రి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో దేవతామూర్తులకు విశేష అలంకారం చేసి సర్వదర్శనం కల్పించారు. కార్యక్రమంలో భాగంగా మహిళా భక్తులందరికీ వాయనాలు అందజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, ఇంటాక్ జిల్లా కన్వీనర్ కె.చిన్నపరెడ్డి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో హాజరైన మహిళా భక్తులందరికీ చీర, పూలు, పండ్లు, గాజులు, పసుపు కుంకుమలతో కూడిన సారెను అందజేశారు.

భద్రకాళికి రాహుకాల పూజలు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి రాహుకాల పూజలలో భాగంగా దీపాలు పెట్టి హారతులు పట్టారు. నిమ్మకాయలపై వత్తులు వెలిగించారు. అనంతరం అమ్మవారికి రంగులపూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, నిమ్మకాయలతో అల్లిన హారాలతో అలంకరించి దర్శన ఏర్పాటు చేశారు.

వీరభద్రుడిని దర్శించుకున్న అరుణాచలం రుద్రాక్షస్వామి

రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారిని అరుణాచలం రుద్రాక్షస్వామి దర్శించుకున్నారు. శుక్రవారం ఆయన ఆలయానికి రాగానే ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పి.విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు పూర్ణకుంబంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు స్వామి వారు, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అధిక ఎరువుల వాడకంతో అనర్థాలు

అట్లూరు : అధిక ఎరువుల వాడడం వలన అనర్థాలు తెచ్చుకున్నట్లేనని సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మా) శాస్త్రవేత్త డాక్టరు వీరయ్య పేర్కొన్నారు. శుక్రవారం వరి సాగుపై రైతులకు శిక్షణా కార్యక్రమం బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు ముందుగా వరి పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో బ్యాక్టీరియా ఆకు ఎండు, ఆకు ముడత ఆకు నల్లి వంటి చీడ పీడలను గుర్తించి తగు సూచనలు సలహాలు చేశారు. యూరియా అవసరానికి మించి వాడుతున్నారని అలా వాడడం వలన అనర్థాలు ఎక్కువ అవుతాయన్నారు. అనంతరం వనిపెంట శాస్త్రవేత్త డాక్టర్ హర్షిత మాట్లాడుతూ భూసార పరీక్షా ఫలితాల ఆధారంగానే ఎరువులు వాడాలన్నారు. అనంతరం రైతు శిక్షణా కేంద్రం ఏఓ పద్మజ మాట్లాడుతూ వరిలో కాలిబాటలు వరినారు కొసలు తుంచి నాటాలని పేర్కొన్నారు. ఏపీడీ పద్మలత, మండల వ్యవసాయ అధికారి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ

కడప కార్పొరేషన్: అవ్వాతాతల మోముల్లో చిరునవ్వు చూడాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు పాకా సురేష్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక అక్కాయపల్లె సచివాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాకా సురేష్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 29,050 మందికి రూ.8 కోట్లు పింఛన్ల రూపంలో ఇస్తున్నారన్నారు. 47వ డివిజన్‌లో 797 మందికి కొత్త పెన్షన్లు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు రాజశేఖర్, రెడ్డి వర కుమార్, వినోద్‌కుమార్‌రెడ్డి, వాసు, సుభాన్, లక్ష్మిదేవి పాల్గొన్నారు.



కొత్త పింఛన్లను పంపిణీ చేస్తున్న పాకా సురేష్

– నగరంలోని 30 వ డివిజన్‌లో కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ ఆధ్వర్యంలో కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జరుగు రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం 1వ డివిజన్‌లోని పాతకడప సచివాలయంలో కొత్తగా పింఛన్లు మంజూరైన వారికి కార్పొరేటర్ ఆర్. చెన్నయ్యతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. ఒకటో డివిజన్‌లో 570 పింఛన్లు ఇస్తుండగా, ప్రస్తుతం అవి 929కి చేరాయన్నారు.

సమతుల్య ఆహారంతో ఆరోగ్యజీవనం

వైవీయూ : సమతుల్యమైన ఆహారం తీసుకోవడం ద్వారా పోషకాహార లోపాన్ని తగ్గించవచ్చని ఆ దిశగా ప్రజలను చైతన్యవంతం చేయాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ సూచించారు. వైవీయూ ఫుడ్‌టెక్నాలజీ శాఖ సమన్వయకర్త డా. వి. రామకృష్ణ ఆధ్వర్యంలో జాతీయ పోషకాహార వారోత్సవాలు–23 ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడారు. ప్రభుత్వాలు పాఠశాల విద్యార్థులకు పోషక విలువలు గల ఆహారాన్నిస్తున్నారని గుర్తుచేశారు. వైవీయూ తొలి వైస్ చాన్సలర్ ఆచార్య అర్జుల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పుట్టుక నుంచి 20 ఏళ్లలోపు ఏ ఆహారం అయితే తీసుకుంటామో ఆ ఆహార పదార్థాల ప్రభావం జీవితాంతం ఉంటుందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ప్రొద్దుటూరు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి. నాగరాజు, పాలకమండలి సభ్యులు ఆచార్య పి. చంద్రమతీశంకర్, డా. మాదక్క, జె. వెంకటలక్ష్మి, డా. వై. ప్రమోద, పి. ముబీనాబేగం పాల్గొన్నారు.

సాహితీ శిఖరం పుట్టపర్తి నారాయణాచార్యులు



పుట్టపర్తి నారాయణాచార్యులు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : పుట్టపర్తి నారాయణాచార్యులు సాహితీ రంగంలో శిఖర సమానుడని అగస్త్యేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి నారాయణాచార్యుల వర్ధంతిని పురస్కరించుకుని ప్రొద్దుటూరు శివాలయం సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి నారాయణాచార్యులు రచించిన శివతాండవం కావ్యం ఆయనకు ఎంతో పేరు తెచ్చిందన్నారు. శివాలయంలోనే ఆ కావ్యాన్ని రచించడం ప్రొద్దుటూరు ప్రజల అదృష్టమన్నారు. సాహితీ రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం ఆయన జ్ఞాపకార్థం తపాల బిళ్ల విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి సాహితీ పీఠం అధ్యక్ష, కార్యదర్శులు వంకదార వీరభద్రయ్య, జింకా సుబ్రహ్మణ్యం, కాశీవరపు వెంకట సుబ్బయ్య, కొత్తపల్లె శీను, తవ్వా సురేష్, ప్రభుకుమార్, ఆరవేటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శాసన పరిశోధనలో 'శివలెంక'కు అపార పరిజ్ఞానం

కడప కల్చరల్ : శాసన పరిశోధనలో శివలెంక శ్రీరామచంద్రమూర్తికి అపార పరిజ్ఞానం ఉందని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి అన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శుక్రవారం శివలెంక సంస్మరణ సభను నిర్వహించారు. ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి, వైవీయూ పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, పరిశోధన కేంద్రం సిబ్బంది కలసి శివలెంక చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం ఆచార్య రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ శివలెంక రాయలసీమలో పర్యటించి అనేక శాసనాలను వెలుగులోకి తెచ్చి అధ్యయనం చేశారని గుర్తుచేశారు. ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ శ్రీరామచంద్రమూర్తి పరిశోధన చేసి వెలువరించిన గ్రంథం ×ఎ స్టడీ ఆఫ్ తెలుగు ప్లేస్ నేమ్స్× శాసనాల ఆధారంగా రాసిన అత్యంత ప్రామాణిక గ్రంథమని, ఇది ప్రపంచవ్యాప్తంగా విశేషమైన ఖ్యాతిని పొందిందన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా.చింతకుంట శివారెడ్డి, మరో సహాయ పరిశోధకులు డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి మాట్లాడుతూ శ్రీరామచంద్రమూర్తి శాసనాల ఆధారంగా అనంఖ్యాకమైన వ్యాసాలను వివిధ జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురించారన్నారు. ఈ కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



శివలెంక చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నాణ్యమైన పరిశోధనల కేంద్రం వైవీయూ

– వైవీయూలో ఓరియంటేషన్ కార్యక్రమం

వైవీయూ: విదేశాల్లో పరిశోధన, అనుభవం గడించిన యువ పరిశోధకులు ఒక్క యోగివేమన విశ్వవిద్యాలయంలో మాత్రమే లభిస్తారని వైవీయూ తొలి వైస్ చాన్సలర్ ఆచార్య అర్జుల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వైవీయూలోని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో పరిశోధక విద్యార్థులకు 'రీసెర్చ్ ఓరియంటేషన్ ప్రోగ్రాం' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా, ముఖ్యవక్తగా విచ్చేసిన ఆచార్య అర్జుల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన పరిశోధనలకు కేంద్రం వైవీయూ అని గుర్తుచేస్తూ మరింత నాణ్యతతో కూడిన పరిశోధకులను తీసుకువచ్చేందుకు 11 రోజుల పాటు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత పరిశోధనల ఆవశ్యకత, భావి పరిశోధకులు అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం తీసుకువచ్చిన అధునాతన పరిశోధన నియమ నిబంధనలను గురించి అవగాహన కల్పించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ 11 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని వైవీయూ ప్రతిష్టాత్మకంగా చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ప్రొద్దుటూరు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి. నాగరాజు, ఆర్అండ్‌డీ సెల్ సంచాలకులు ఆచార్య పులి చంద్రఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.



పరిశోధకులతో వీసీ తదితరులు

క్లుప్తంగా

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా మండల విద్యాశాఖ కార్యాలయాల్లో మెసెంజర్స్‌గా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ రెగ్యులర్ చేయాలని సమగ్రశిక్ష మెసెంజర్స్ అసోసియేషన్ నాయకులు చిన్నయ్య, భద్ర, సుబ్రమణ్యంలు కోరారు. ఈ విషయమై శుక్రవారం డిప్యూటీ సీఎం అంజాద్‌బాష, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ యంవీ రామచంద్రారెడ్డిలను తమ కార్యాలయాల్లో కలిసి వినతిపత్రాలను సమర్పించారు. సంబంధిత సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని వారు కోరారు.

హాస్టల్ వర్కర్‌పై చర్యలు తీసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్ : జమ్మలమడుగు ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్‌లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న వర్కర్ నారాయణమ్మపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.శంకర్ శుక్రవారం డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు విన్నవించారు. హాస్టల్‌లో విధులు నిర్వర్తించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థులను బెదిరింపులకు గురి చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగేంద్రబాబు, నాయకులు పాల్గొన్నారు.

నీరు నిల్వ లేకుండా చూడాలి



వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ వైద్యులు డాక్టర్ ప్రశాంత్ వర్ధన్ తెలిపారు. శుక్రవారం నగరంలోని శ్రీరామనగర్ కాలనీతోపాటు ఇతర ప్రాంతాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ప్రేశాంత్ వర్ధన్ మాట్లాడుతూ శ్రీరామ్‌నగర్ కాలనీలో ఇంటింటి సర్వే నిర్వహించారు. దోమకాటు వల్ల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్న లత , హోమియో పతి వైద్యులు, సూపర్‌వైజర్లు గుల్జార్‌బేగం, ఏఎన్ఎం లలిత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

హోండా ఎస్‌పీ వాహనం మార్కెట్‌లోకి విడుదల



వినియోగదారుడికి తాళాలు అందజేస్తున్న అమోఘ గ్రూప్ ఛైర్మన్ సుంకర శ్రీనివాస్

కడప కార్పొరేషన్: హోండా ద్విచక్ర వాహనాల కంపెనీ నూతనంగా ప్రవేశపెట్టిన ఎస్‌పీ 162సీసీ వాహనం కడప మార్కెట్‌లోకి విడుదలైంది. కడప నగరం చిన్నచౌకులోని అమోఘ హోండా షోరూంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అమోఘా గ్రూప్ ఛైర్మెన్ సుంకర శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై నూతన వాహనాన్ని ఆవిష్కరించారు. మొదటి వాహనం కొనుగోలు చేసిన వినియోగదారుడికి తాళాలు అందజేశారు. షోరూం జనరల్ మేనేజర్ మల్లికార్జున , షోరూం సిబ్బంది పాల్గొన్నారు

తాళ్లపాక అన్నమాచార్య సెనెట్‌హాల్ ప్రారంభం



సెనెట్‌హాల్‌ను ప్రారంభిస్తున్న వైవీయూ అధికారులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం నూతన పరిపాలన భవనంలో సెనెట్‌హాల్‌ను విశ్వవిద్యాలయ వ్యవస్థాపక వైస్ చాన్సలర్ ఆచార్య అర్జుల రామచంద్రారెడ్డి, వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ 200 సీట్ల సామర్థ్యం, ఏసీ సౌకర్యాలతో అధునాతనంగా రూపకల్పన చేశామన్నారు. ఆచార్య అర్జుల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ప్రారంభ సమయంలో పరిపాలన భవనం ఆధునిక డిజైన్లతో రూపొందించడం జరిగిందన్నారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రత్యేక శ్రద్ధతో వైవీయూ భవనాలను ప్రఖ్యాత ఆర్కిటెక్చర్లతో తయారు చేయించామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ప్రారంభం

చింతకొమ్మదిన్నె : మండలంలోని నాగిరెడ్డిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, డీసీసీ, ఆప్కో చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీ రాణి, సీకేదిన్నె జెడ్పీటీసీ సభ్యుడు పి.నరేన్ రామాంజులరెడ్డిలు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలన్నారు. సహకార సంఘ సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీవో జి.సుభాషిణి, డీసీసీబీ సీఈవో రాజేంద్రకుమార్, సొసైటీ అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి, పాలక వర్గ సభ్యులు జి. శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆర్యవైశ్య సభ సమావేశం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆర్యవైశ్య సభ 133వ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 జమా ఖర్చులను ఆమోదించుట, గత సర్వసభ్య సమావేశం నుంచి నేటి వరకు జరిగిన కార్యక్రమాలు తెలపడం, ఆమోదించడం తదితర వాటిని సమావేశంలో చర్చిస్తారన్నారు. సమావేశంలో ఆర్యవైశ్య సభ సభ్యులు, 18 సంవత్సరాలు నిండిన ఆర్యవైశ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

తేనెటీగల పెంపకంపై రైతులకు శిక్షణ

రాజంపేట రూరల్ : తేనెటీగల పెంపకంపై పులివెందుల, బద్వేలు, కడప, రాజంపేట నియోజకవర్గాలలోని రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని హస్తవరం గ్రామంలో ఆదర్శ రైతు ఆకేపాటి ప్రసాద్‌రెడ్డి పొలంలో శుక్రవారం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ వి.శిల్పకళ ఈ శిక్షణ కార్యక్రమంలో శిక్షణ అందజేశారు. ఆమె మాట్లాడుతూ తేనెటీగలలో 4 రకాలు ఉంటాయని అందులో పెంచుకోదగినవిగా ఐరాపా, పుట్ట తేనెటీగలు ఉన్నాయన్నారు. వీటి నుంచి తేనె మాత్రమే కాకుండా ఇతర ముఖ్యమైన ఉత్పత్తులైన మైనము, పుప్పొడి, రాజహారం, విషంతోపాటు ప్రోపోలీస్ లభ్యమవుతాయని తెలియజేశారు. అలాగే తేనెటీగలు సంఘ జీవులని వాటిలో రాణి ఈగ, పోతు టీగలు, కూలీ ఈగలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో బాబా ఫకృద్దీన్ తేనెటీగల పెట్టెలని ఎలా వృద్ధి చేసుకోవాలో, ఏ విధంగా తేనెని తీయాలో విపులంగా వివరించారు. అనంతరం ఆదర్శ రైతు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తేనెటీగల పెంపకం లాభదాయకమని అన్నారు. రైతులు తేనెటీగల పెంపకంపై దృష్టి సారించి లాభాలు పొందాలని కోరారు.